క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం భక్తుల భజనలు, రాత్రి స్వామికి పల్లకిసేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

నేత్రదానం



జయలక్ష్మి (ఫైల్)

నెల్లూరు(బారకాసు): నవలాకులతోటకు చెందిన జయలక్ష్మి (56) గురువారం మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99481 64781, 93471 11033 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గాయపడిన వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): ఫిట్స్‌తో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. రామ్‌జీనగర్‌కు చెందిన రహంతుల్లా (40), అంజూ దంపతులకు ఇద్దరు కుమారులు. స్థానికంగా పాన్ షాపును నిర్వహిస్తున్న రహంతుల్లా మద్యానికి బానిసయ్యారు. ఫిట్స్‌తో రెండేళ్లుగా బాధపడుతూ జీజీహెచ్‌లో చికిత్స చేయించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో భగత్‌సింగ్‌కాలనీలోని టిడ్కో ఇళ్లలో నివాసం ఉంటున్న తన పెద్దనాన్న ఖాదర్‌బాషా ఇంటికెళ్తానని భార్యకు చెప్పిన రహంతుల్లా బుధవారం బయటకొచ్చారు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో భర్తకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. రాత్రి 11.30 ప్రాంతంలో భర్త బావ మాబాషా ఆమెకు ఫోన్ చేసి.. టిడ్కో ఇళ్ల వద్ద రోడ్డుపై రహంతుల్లా పడి నోటి నుంచి నురుగు వస్తోందని, తల వెనుక భాగంలో రక్తగాయమై ఉందని చెప్పారు. దీంతో అంజూ తన మరిది సుభానీతో కలిసి ఘటన స్థలానికి వెళ్లారు. చికిత్స నిమిత్తం నారాయణ హాస్పిటల్‌కు అక్కడి నుంచి జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఘటనపై నవాబుపేట పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఎస్సై తిరుపతయ్య హాస్పిటల్‌కు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ పత్రాల కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నకిలీ పత్రాలతో రూ.కోట్ల విలువైన స్థలాన్ని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసిన కేసులో నిందితుడ్ని బాలాజీనగర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ రాములునాయక్ సమాచారం మేరకు.. తన భూమికి కొందరు నకిలీ పత్రాలను సృష్టించి ఇతరులకు విక్రయించారంటూ రామ్మూర్తినగర్‌కు చెందిన దేవిరెడ్డి వాయుసుత బాలాజీనగర్ పోలీసులకు ఈ నెల 20న ఫిర్యాదు చేశారు. ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి ఇన్‌స్పెక్టర్ దర్యాప్తు చేపట్టారు. నకిలీ పత్రాలను సృష్టించి ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసింది శ్రీధర్‌రావేననే అంశం విచారణలో తేలిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మిగిలిన వారు స్థలాన్ని కొనుగోలు చేశారే తప్ప నకిలీ పట్టాల గురించి ఏమీ తెలియదని, దీంతో శ్రీధర్‌రావునే అరెస్ట్ చేశామని చెప్పారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన



నెల్లూరు(దర్గామిట్ట): పతకాలు సాధించిన జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులకు కలెక్టర్ హరినారాయణన్ గురువారం అభినందించారు. అరుణాచల్‌ప్రదేశ్ రాజధాని ఇటానగర్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి కర్లింగ్ పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించిన పలువురు ఉత్తమ ప్రతిభ చూపారు. ఈ క్రమంలో వీరిని కలెక్టర్ అభినందించారు. కర్లింగ్ అసోసియేషన్ సభ్యుడు సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇంట సంక్షేమ సిరులు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: సంక్షేమ పథకాలతో పేదల ఇంట ఆనందం వెల్లివిరుస్తోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని యల్లాయపాళెంలో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలంతా బాగుండాలన్న ఉద్దేశంతోనే నవరత్నాల పథకాలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రతి పేదవాడి ఇంట సంతోషాలు చూడాలన్న లక్ష్యంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక లోటులోనూ సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్నారన్నారు. ప్రతిఇంటికీ ఎమ్మెల్యే వెళ్లి సమస్యలు తెలుసుకోవడం ఒక బృహత్తర కార్యక్రమం అని చెప్పారు. దీని వల్ల అనేక మంది సమస్యలను తెలుసుకుని తక్షణం పరిష్కరించే వెసులుబాటు కలిగిందన్నారు. ప్రజలంతా సంతోషంగా ఉండాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. సచివాలయ, వలంటీర్‌లు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లు పెట్టి ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు తీసుకొచ్చిన గొప్ప నేత జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఏ గడపకు వెళ్లినా ఆనందంతో స్వాగతిస్తున్నారంటే అందుకు ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాలే కారణమన్నారు. రాష్ట్రంలో అన్నివర్గాల వారు సుఖసంతోషాలతో ఉన్నారని, మళ్లీ రాష్ట్రంలో జగనన్న పాలన రావాలని కోరుకొంటున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, ఎమ్మెల్యే తనయుడు రజత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంపీపీ జి.జ్యోతి, నేతలు ఇసనాక సునీల్‌రెడ్డి, కె.వెంకటరమణారెడ్డి, తాటిపర్తి భాస్కర్, దేవిరెడ్డి సాయిరెడ్డి, మల్లికిశోర్‌రెడ్డి, మాబాషా, టి.ప్రసాద్‌రెడ్డి, వై.పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వేపల్లిలో మంత్రి కాకాణి పర్యటన

వెంకటాచలం: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం సర్వేపల్లి గ్రామంలో పర్యటిస్తారని మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి గురువారం తెలిపారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 4.30 గంటలకు మంత్రి గ్రామానికి చేరుకుని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తారన్నారు. శనివారం కూడా కార్యక్రమం కొనసాగుతుందని తెలియజేశారు.

అనధికార మద్యం విక్రయాలపై దాడులు

నెల్లూరు(క్రైమ్): బీవీనగర్‌లోని ఓ బార్ వద్ద అనధికార మద్యం విక్రయాలపై వేదాయపాళెం పోలీసులు గురువారం తెల్లవారుజామున దాడులు చేశారు. నిందితుడ్ని అరెస్ట్ చేసి అతని నుంచి 42 క్వార్టర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్‌కు చెందిన చంద్రారెడ్డి కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. సంపాదన కుటుంబపోషణకు సరిపోకపోవడంతో అనధికార మద్యం విక్రయాలపై దృష్టి సారించారు. నగరంలోని వివిధ షాపుల్లో మద్యాన్ని కొనుగోలు చేసి బీవీనగర్‌లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద అర్ధరాత్రి వేళ విక్రయించి సొమ్ముచేసుకోసాగారు. దీనిపై వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ రమణకు పక్కా సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఎస్సై రాజ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. విక్రేత చంద్రారెడ్డిని అరెస్ట్ చేసి అతని నుంచి రూ.6280 విలువజేసే 42 క్వార్టర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరసింహారావు

• ఎంపీడీఓ నరసింహా రావు

బుచ్చిరెడ్డిపాళెం : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. మండలంలోని జొన్నవాడ గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతివారం నాలుగు సచివాలయాలను తనిఖీ చేస్తున్నామని, ఇందులో భాగంగానే జొన్నవాడ సచివాలయాన్ని సందర్శించామన్నారు. ముఖ్యంగా గడువులోపు ఇళ్లను నిర్మించే విధంగా సంబంధిత అధికారులు, ఇంజినీర్ అసిస్టెంట్లు నిర్మాణాల పురోగతిపై పర్యవేక్షణ చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ విధులకు హాజరుకావాలని పేర్కొన్నారు. సచివాలయంలో ప్రతిరోజు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీపీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి నారాయణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సచివాలయాలపై అవగాహన



సచివాలయం బిట్-4లో రికార్డులను పరిశీలిస్తున్న ట్రెయినీ డీసీ మహేష్

పొదలకూరు : గ్రామ సచివాలయ నిర్వహణపై అవగాహన కోసం ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ మహేష్ అల్కతుర్ పొదలకూరు బిట్-1, 3, 4 సచివాలయాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు పంచాయతీ సెక్రటరీ అల్లాభక్షు సచివాలయ రికార్డుల నిర్వహణపై వివరించారు. సిబ్బంది పనితీరు, వలంటీర్ వ్యవస్థ తదితర అంశాలను మహేష్ అడిగి తెలుసుకున్నారు. ఈఓపీఆర్డీ నరసింహారెడ్డి డీసీ వెంట ఉన్నారు.

అధికారుల పనితీరు భేష్



మాట్లాడుతున్న ఏపీఓ రాజమ్మ

• ఎంపీపీ వజ్రమ్మ

మనుబోలు : మండల పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం విజయవంతంగా సాగిందని, ఇందులో అధికారుల పనితీరు బాగుందని ఎంపీపీ గుండాల వజ్రమ్మ ప్రశంసించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాల్సి ఉందన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం ఉద్యోగులు ప్రజా ప్రతినిధులకు సహకరించడం లేదని ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకం ఏపీఓ రాజమ్మ మాట్లాడుతూ ఉపాధి పనులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోజువారి కూలీ రూ.272 వరకూ వస్తోందని వివరించారు. జాబ్‌కార్డులు లేనివారికి వెంటనే అందజేస్తామని తెలిపారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల్లో పురోగతిని వివరించారు. సమావేశానికి ఆర్టీసీ, పోలీస్, మార్కెటింగ్, అటవీ శాఖల అధికారులు గైర్హాజరు కాగా తహసీల్దార్ లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అనితమ్మ, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామికి గ్రామోత్సవం



విశేషాలంకరణలో వీరాంజనేయస్వామి

ముత్తుకూరు : ముత్తుకూరులోని వీరాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారి జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు ఆంజనేయస్వామి విశేష అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గ్రామోత్సవం బయలుదేరింది. దారిపొడవునా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. దివంగత ఈదూరు రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం ఇందిరమ్మ, దువ్వూరు వివేకానందరెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

కామాక్షితాయి సేవలో ప్రిన్సిపల్ సెక్రటరీ



అమ్మవారిని దర్శించుకుంటున్న ప్రద్యుమ్న, కుటుంబసభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్, ఆర్‌అండ్‌బీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం రాత్రి దర్శించుకున్నారు. తొలుత వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం గణపతి స్వామి, సుబ్రహ్మణ్యం స్వామి, మల్లికార్జున స్వామి, కామాక్షితాయి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాకపోకలకు అవస్థలు



అల్లూర్తి- నావూరు రహదారి మధ్య ప్రవహిస్తున్న వాగు

• బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే సాఫీ ప్రయాణం

పొదలకూరు : మండలంలోని అల్లూర్తి-నావూరు రహదారి మధ్య ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే రాకపోకలు పెరగడంతో పాటు, దూరం తగ్గుతుంది. అయితే వివిధ కారణాల వల్ల బ్రిడ్జి నిర్మాణం అంచనాలు పూర్తి చేసుకున్నా ఆచరణలో కొంత జాప్యం నెలకొంటోంది. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జెడ్పీచైర్మన్‌గా పనిచేస్తున్న కాలంలో గ్రామీణ ప్రాంతాల మధ్య సత్సంబంధాలు నెలకొల్పాలని బ్రిడ్జిని నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే అప్పట్లో కొన్ని రాజకీయ కారణాల వల్ల ప్రతిపాదనలు బుట్టదాఖలు అయ్యాయి. తర్వాత మండలంలోని అల్లూర్తి-నావూరు లింకురోడ్డును పంచాయతీరాజ్ శాఖ నుంచి ఆర్‌అండ్‌బీ శాఖలో విలీనం చేయించారు. ఆర్‌అండ్‌బీ అధికారుల ద్వారా కూడా బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించారు. తిరిగి ప్రతిపాదనలను పంపి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తే వర్షాకాలంలో రాకపోకలకు అనుకూలంగా ఉంటుందని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు

మండలంలోని అల్లూర్తి-నావూరు రోడ్డు మధ్యలో వాగుపై తాత్కాలిక పైపు కల్వర్టు ఏర్పాటుకు గ్రామస్తులు ప్రయత్నిస్తున్నారు. అయితే మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శాశ్వత బ్రిడ్జి నిర్మాణానికి అధికారులను అంచనా వేయాల్సిందిగా ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు అంచనాలు రూపొందించే పనిలో ఉన్నారు. కల్వర్టు నిర్మాణ పనులు పూర్తి చేస్తే వాగు ఉధృతికి కల్వర్టు నిలవదని అధికారులు మంత్రి దృష్టికి తీసుకు వెళ్లినట్లుగా తెలుస్తోంది. ప్రస్తుతం స్వల్పంగా వాగు నుంచి నీరు ప్రవహిస్తోంది. ఆటోలు, ద్విచక్ర వాహనాలు సైతం రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రోడ్డు మీదుగా పులికల్లు, మొగళ్లూరు, అంకుపల్లి, ఆర్‌వైపాళెం, వావింటపర్తి, ఊసపల్లి గ్రామాల నుంచి అల్లూర్తి మీదుగా నావూరు, నావూరుపల్లి, చెన్నారెడ్డిపల్లి గ్రామాలకు వెళ్లవచ్చు. ఇదే రహదారి మీదుగా నేదురుమల్లి, బత్తులపల్లి, సంగం వరకు పైగ్రామాల ప్రజలు వెళ్లేందుకు అవకాశం ఉంది.

కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు



ఎర్త్‌ల వద్ద నీరు పోస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది



సర్వేపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

• అధిక ఉష్ణోగ్రతల ప్రభావం

వెంకటాచలం : గత పది రోజులుగా ఎండల ప్రభావంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రతతో పాటు అధిక విద్యుత్ లోడ్ వల్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వైర్లు తెగిపోతున్నాయి. మండలంలోని ఇస్కపాళెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న సర్వేపల్లి గ్రామంలో వారం క్రితం రెండు చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. ట్రాన్స్‌కో ఏఈ అనిల్‌కుమార్, లైన్‌మన్ మురళీ ఆధ్వర్యంలో సత్వరమే సిబ్బంది కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. అయితే వెంటనే సర్వేపల్లి గ్రామంలో కూడా పలుచోట్ల విద్యుత్ లైన్లు కాలిపోయాయి. రాత్రి వేళ జరగడంతో విద్యుత్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ట్రాన్స్‌కో సిబ్బంది అర్ధరాత్రి వరకు పనిచేసి కాలిపోయిన విద్యుత్ తీగలను గుర్తించి మరమ్మతులు చేయడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. జిల్లాలో పలుచోట్ల ఎండవేడిమి కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైర్లు తెగిపోతుండటంతో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న చోట ఎర్త్‌లకు నీరు పోసి చల్లార్చాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో మండలంలోని ప్రతి గ్రామంలో ట్రాన్స్‌కో సిబ్బంది ప్రతిరోజు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్న చోట ఎర్త్‌లకు నీరు పోస్తున్నారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ అనిల్‌కుమార్ మాట్లాడుతూ గత పది రోజుల నుంచి ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని, ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎర్త్‌ల వద్ద నీరు పోసి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా చేస్తున్నామని చెప్పారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు : రాష్ట్రంలోని వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. నార్తురాజుపాళెంలో ఉన్న వీసీఆర్ అతిథిగృహంలో మండలంలోని వలంటీర్‌లను సేవారత్న, సేవావజ్ర, సేవామిత్ర పురస్కారాలతో ఎమ్మెల్యే ప్రసన్న గురువారం సాయంత్రం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో వలంటీర్లు అందించిన సేవలు మరువలేనివన్నారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ప్రజలను జలగల్లా పీల్చుకు తిన్నారని విమర్శించారు. వలంటీర్‌లు ఎలాంటి సిఫార్సు అవసరం లేకుండా ప్రజల ఇళ్లకే పథకాలు అందిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారన్నారు.

చుక్కల భూముల రైతులకు పట్టాలు

కార్యక్రమంలో భాగంగా చుక్కల భూములున్న రైతులకు ఎమ్మెల్యే పట్టాలను అందదజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా రైతులు చుక్కల భూములపై రుణాలు తెచ్చుకోలేక, విక్రయించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి రైతులకు పట్టాలు పంపిణీ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అని కొనియాడారు. జిల్లాలో 18 వేలకు పైగా రైతులకు సంబంధించిన 43,270 ఎకరాల చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి హక్కులు కల్పించారని చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటికే 2,673 ఎకరాల చుక్కల భూములకు పరిష్కారం చూపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, ఎమ్మెల్యే తనయుడు రజత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, తహసీల్దార్, ఎంపీడీఓలు రమాదేవి, సుబ్రహ్మణ్యం, ఎంపీపీ జి.జ్యోతి, సర్పంచ్‌లు బి.సుప్రియ, ఎం.రంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పి.అనిల్‌కుమార్‌రెడ్డి, నేతలు కె.శ్రీనివాసులురెడ్డి, ఎస్.మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికెళ్లొద్దు

కోవూరు : యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని, చెడు వ్యసనాలతో బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. కోవూరు సెబ్ కార్యాలయ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి, మద్యం, పొగ తాగడం తదితర వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. వేలంలో మూడు వాహనాలను పాటదారులు పాడుకున్నారు. కార్యక్రమంలో సెబ్ సీఐ నరహరి, ఎస్సై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

వెంకటాచలం : మోటారు బైక్ అదుపుతప్పి పడడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై గురువారం జరిగింది. గూడూరు పట్టణానికి చెందిన కిశోర్, మనోహర్ బైక్‌పై కృష్ణపట్నం వెళ్తున్నారు. సర్వేపల్లి సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై లారీ అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో కిశోర్, మనోహర్‌లకు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

షాదీమంజిల్‌కు అద్దె ఖరారు

నెల్లూరు(బారకాసు): కోటమిట్టలో అధునాతనంగా నిర్మించిన షాదీమంజిల్‌లో శుభకార్యాలు జరుపుకొనేందుకు అద్దెను ఖరారు చేశామని కమిషనర్ వికాస్ మర్మత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి కార్యానికి రూ.10 వేల చొప్పున నగరపాలక సంస్థ కార్యాలయంలో చెల్లించి రసీదును పొందాలని సూచించారు.